# మల్లిక ప్రేమించిందా?!?

కండ్లకుంట శరత్‌చంద్ర



"సర్! మీ ఇంట్లో ఇంత పెద్ద గ్రంథాలయం వుంది. ఇన్ని పుస్తకాలు చదువుతారుకదా! అందులో మీకు ఏ సబ్జెక్టంటే ఇష్టం"

"మేథమేటిక్స్"

"సర్! మీరు అందించిన ఈ విషయాలు ప్రజలకెంతో ఉపయోగపడుతున్నాయి. మీరు ఇంకా కొత్త విషయాలు అందిస్తూనే వుంటారా?"

"తప్పకుండా అందిస్తాను."

"సారీసర్! పర్సనల్ క్వశ్చన్! మీరూ పెళ్లెందుకు చేసుకోలేదు?"

ఈ ప్రశ్నకు, తను నవ్వాడు. "జీవితానికి పెళ్ళి తప్పనిసరి ప్రక్రియంటారా!"

"అదికాదు నా ఉద్దేశ్యం. ఏవైనా కారణాలున్నాయేమో-తెలుసుకుందామనీ"

"ఉన్నాయ్! కానీ.. అవన్నీ చెప్పి మిమ్మల్ని బాధపెట్టడం, ఇంకా ఆ పాత విషయాలు గుర్తుతెచ్చుకుని మన వేల్యుబుల్ టైమ్ వేస్ట్ చేసుకోవడం నాకు ఇష్టం లేదు,"

"ఓ.కే సర్! మీరు యువతకిచ్చే సందేశం."

"మనల్ని ప్రేమించేవాళ్ళను, మనం ప్రేమించే తీరతామనీ గ్యారంటీ లేదు. అలాగే - మనం ప్రేమించేవాళ్ళు, ఖచ్చితంగా మనల్నే ప్రేమిస్తారనీ నమ్మకం లేదు. చివరగా నేను చెప్పేదేమిటంటే

'ఆకర్షణ'ను 'ప్రేమ' అనుకుని టైమ్‌వేస్ట్ చెయ్యకుండా నరనరాల్లో దేశభక్తిని నింపుకుని, దేశం కోసం 'దేన్నైనా' త్యాగం చెయ్యడానికి అన్ని సమయాల్లోనూ భారతీయులందరూ రెడీగా వుండాలి. అంతే!"

"థ్యాంక్యూ సర్!"

దినపత్రికలో ప్రచురింపబడిన తన ఇంటర్వ్యూను చూస్తున్నాడు. దానిపై ఇలా రాశారు.

"మహామేధావి, నిజాయితీకి మారుపేరు, దేశంకోసం వీరోచితంగా శత్రుదేశమైన పాకిస్తాన్‌తో పోరాడిన గొప్ప దేశభక్తుడు, ఎన్నో గణిత సూత్రాలను రచించిన గణిత శాస్త్రవేత్త, అటు ఆంగ్లంలోనూ, హిందీలోనూ ఇటు మాతృభాష తెలుగులోనూ ఎన్నో విజ్ఞాన, సాహిత్య, తాత్విక గ్రంథాలను అందించిన మహారచయిత, నిరాడంబరుడు, నిగర్వి, ధీశాలి, అరవై అయిదు సంవత్సరాల వయసులోకూడా ప్రపంచానికి ఇంకా ఇంకా ఏదో కొత్తదనాన్ని అందించాలనుకునే మహానుభావుడు, ప్రొఫెసర్‌గా ఉస్మానియా యూనివర్సిటీకి గొప్ప సేవలందించిన శ్రీ రవిశంకరశాస్త్రిగారితో ప్రత్యేక ఇంటర్వ్యూ!" తేదీ చూశాడు, **14.02.2044**

రవిశంకర్ చిన్నగా నవ్వుతూ దినపత్రికను ప్రక్కకు పెట్టాడు. తను, పెళ్ళెందుకు చేసుకోలేదని, ప్రతి ఒక్కరూ అడుగుతారు. సమాధానం తనకు మాత్రమే తెలుసు.

బెడ్రూంలోనికి వెళ్ళి పాత ట్రంకుపెట్టెను తీసి, అందులో ఉన్న ఆల్బమ్‌ను బయటికి తీశాడు. చెదరని చిరునవ్వుతో ఉన్న మల్లిక ఫోటో! ఒక్కసారిగా అతని మనసు ఇరవయ్యో శతాబ్దానికి పరుగెత్తింది.

+ + +

మల్లిక తనకు చిన్నప్పటినుండీ తెలుసు. ఆ మాటకొస్తే ఊహ తెలియనప్పటి నుండీ తెలుసు. తమ వీధి అవతలే వాళ్ళ ఇల్లు. ఇద్దరూ కలిసి స్కూల్‌కు వెళ్ళేవారు. తనది చిన్న పెంకుటిల్లు. తండ్రి పౌరోహిత్యం చేస్తాడు.

మల్లికవాళ్ళు భూస్వాములు. లంకంత ఇల్లు. ఆ ఇంటికి వెళ్ళి టి.వి. చూడడం, వీడియో గేమ్స్ ఆడడం చేసేవాడు. మల్లిక తల్లిదండ్రులు, తనను ఏనాడూ, ఆమెతో కలిసి తిరగడానికీ, ఆడుకోవడానికీ అడ్డుపెట్టలేదు.

ఇద్దరూ కలిసి పొలాల గట్ల మీద ఆడేవారు. జామ తోటల్లోనికి వెళ్ళి, జామ చెట్లెక్కి కబుర్లు చెప్పుకునేవారు. మల్లిక, తన ఇంటికి వచ్చి అమ్మ పెట్టే జొన్నరొట్టెలు మహా ఆనందంగా తినేది.

సెలవులొస్తే, మల్లిక పట్నంలో వున్న బాబాయి ఇంటికి వెళ్ళేది. అప్పుడు, తన హృదయం బాధతో విలవిలలాడేది. ప్రభుత్వ లైబ్రరీకి వెళ్ళి, తను ఎన్నో పుస్తకాలు చదివేవాడు. అదేంటో ఏమోగానీ ఏ విషయమైనా సరే, తనకు ఒక్కసారి చెప్తే చాలు, అట్టే గుర్తుండిపోయేది. అతని మేష్టర్లు, అతని తెలివికి అబ్బురపడేవారు. 'ఏకసంథాగ్రాహి' అని అందరూ మెచ్చుకునేవారు. ప్రతి క్లాస్‌లనూ తనదే ఫస్ట్‌ర్యాంక్! ప్రతీ వ్యాసరచన పోటీలోనూ ప్రథమ బహుమతి తననే వరించేది.

మల్లిక ఇంట్లో అందరూ తనను అభిమానించేవారు. మల్లిక అన్నయ్య శ్రీనివాస్, తమకంటే అయిదేళ్ళు పెద్ద. అతను పట్నంలో చదువుతున్నాడు. ఇంటికొచ్చినప్పుడల్లా తనకోసం ఓ కొత్త పుస్తకం తెచ్చేవాడు. మల్లికకు గట్లమీద ఆడడం, గెంతడం ఇష్టం. పుస్తకపఠనం అంటే ఆమెకు గిట్టేదికాదు.

ఇంట్లో, తను చిన్నచిన్న ప్రయోగాలుచేసేవాడు. చిన్నప్పుడే శాంతినారాయణ, వశిష్ఠ వంటి ప్రఖ్యాత గణిత శాస్త్రజ్ఞుల గ్రంథాలను ఔపోసన పట్టాడు.

మల్లికతో కలిసి తిరుగుతున్నంతసేపూ అతనిలో ఏదో చెప్పలేని ఆనందం, భావావేశం. ఆమె దగ్గర లేనంతసేపూ నీళ్ళలో నుండి తీసి, భూమి మీదకు వేసిన చేప పిల్లలా గిలగిలా తన్నుకునేవాడు, అమావాస్య రోజు చంద్రుడు కానరాకపోయేసరికి దిగులుతో విలపించే కలువలా కుంచించుకుపోయేవాడు.

ఆమె గలగలా మాట్లాడుతుంది. కమ్మగా పాడుతుంది. నిద్రలో కూడా అతనికి ఆమె గజ్జెల మోతే వినపడేది.

పదవ తరగతి ముగిసింది. ప్రక్క టౌన్‌లోమల్లికను ప్రైవేట్ కళాశాలలో చేర్పించారు. తాను ప్రభుత్వ కళాశాలలో చేరాడు. టౌన్‌కు, రోజూ ఇద్దరూ ఒకే బస్‌లో వెళ్ళేవారు. మధ్యాహ్నం ఇద్దరూ బయట పార్కులో కూర్చుని భోజనం చేసేవారు.

అతని తండ్రి సంపాదన అంతంత మాత్రంగానే ఉండేది. పండుగలొస్తే, తల్లి, ఊళ్ళోవాళ్ళకు భక్ష్యాలు, లడ్డూలు చేయడానికని ఒప్పుకునేది. వాళ్ళ సంసార నౌక, మునకలు వేస్తూ తేలుతూ పోతోంది.

ఇంటర్ గడిచాక ఉద్యోగాల వేట ప్రారంభించాడు. సంసార నౌకకు తనూ ఓ తెడ్డు వేయాలని అతని ఆరాటం. ఎక్కడా ఉద్యోగాలు దొరకలేదు. తండ్రికి ఉబ్బసం ఎక్కువ కావడం, తల్లి రోజురోజుకూ కృశించిపోవడం అతడి పేదరికాన్ని, వెక్కిరించసాగాయి. చేతిలో డబ్బులాడడం కరువైంది. ఓ ప్రక్క మల్లికపై ప్రేమ! అతని మనసు అలలతో ఎగిసిపడే మహాసముద్రమైంది.

**(తరువాయి 50వ పేజీలో)**

**100% AYURVEDIC PRODUCT**

**గ్యాస్ట్రబుల్‌తో బాధపడుతున్నారా?**
**మలబద్ధకముతో**
**ఇబ్బంది పడుతున్నారా?**
**కడుపునొప్పి మొదలగు జీర్ణశక్తికి సంబంధించిన వ్యాధులకు అనేక సంవత్సరముల నుండి ప్రయోగములు చేసి చంద్రికా వారిచే తయారుచేయబడినటువంటి అతి ఉత్తమమైన ఆయుర్వేద మందు**

**క్యాప్‌జైమ్**
**చూర్ణము**




**జీర, ఇంగువ, సైంధవలవణం, యవాక్షారము, ఇసఫ్‌గోల్, మారీచము మొదలగు అనేక రకములైనటువంటి అతి ఉత్తమమైన ఆయుర్వేద మూలికలతో తయారుచేయబడినది.**

**ఈ క్యాప్‌జైమ్ చూర్ణమ్ తీసుకొనుట వలన ఎటువంటి సైడ్‌ఎఫెక్ట్స్ రావు**

మార్కెట్ చేయువారు
రామా మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ & కో.
పార్కురోడ్, విజయవాడ - 1. ఫోన్ : 2424133.

త్వరలో ప్రారంభం.....

మహిళా లోకానికి మరో కొత్త శీర్షిక!

## ఎంబ్రాయిడరీ & స్టిచింగ్

ప్రియదత్త సకుటుంబ సచిత్ర వారపత్రికలో గత 38 వారాలుగా 'ఫ్యాషన్ డిజైన్' శీర్షికని నిర్వహించిన ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ శ్రీమతి పొట్లూరి మంజుల త్వరలో మరో కొత్త శీర్షిక 'ఎంబ్రాయిడరీ & స్టిచింగ్' పాఠకులకు అందజేస్తారు. పాఠకుల ప్రశ్నలకి సమాధానాలు ఇస్తారు. గతంలో లాగే ఉత్తమ ప్రశ్నని పంపిన పాఠకులకి ప్రతి వారం ఒక డ్రస్ ఉచిత బహుమతిగా అందజేస్తారు.

ఎంబ్రాయిడరీ & స్టిచింగ్‌పై పాఠకులు తమ ప్రశ్నలని ఈ క్రింది చిరునామాకి పంపగలరు.

శ్రీమతి పొట్లూరి మంజుల, అమెజాన్ బొటిక్,
శ్రీ దుర్గా భవానీ కాంప్లెక్స్, సత్యం థియేటర్ ఎదురుగా,
అమీర్‌పేట, హైదరాబాదు - 500 016

## మల్లిక ప్రేమించిందా?..

**(47వ పేజీ తరువాయి)**

మల్లిక తన సొత్తే! తననే పెళ్ళి చేసుకుంటుంది. అందులో ఇక తను ఆలోచించాల్సిదేమీ లేదు. ఇప్పుడున్నదల్లా ఒకటే సమస్య, ఉద్యోగం. బాగా ఆలోచించి బి.ఎస్.ఎఫ్‌కు దరఖాస్తు పంపాడు. సర్వశక్తులూ ఒడ్డి, వ్రాతపరీక్ష, ఇంటర్వ్యూ, ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్ష అన్నీ పాసయ్యాడు. ఉద్యోగం అతని ముందు వాలింది.

సైన్యంలో చేరడానికి, తల్లిదండ్రుల్ని కష్టపడి ఒప్పించాడు. మల్లిక మాత్రం సైన్యంలో చేరవద్దని బ్రతిమాలింది. తను వినలేదు. లేకలేక వచ్చిన ఉద్యోగం కాలదన్నుకుంటే, ఎన్నో లక్షలమంది నిరుద్యోగులు దేశంలో ఎదురుచూస్తున్నారు. అతడు, మరొకరికి అవకాశం ఇవ్వదల్చుకోలేదు.

మల్లిక, కన్నీటితో అతడ్ని రైలెక్కించింది. రైలు కదిలి, బయల్దేబోతుండగా గట్టిగా మల్లిక చెయ్యి పట్టుకుని, అరచేతిలో ముద్దుపెట్టుకున్నాడు.

"మల్లికా ఐ లవ్యూ!"

రైలు స్పీడందుకుంది.

మిలటరీలో చేరి దేశానికి సేవ చెయ్యడం అంటే సంతోషంగా ఉంది. మొదట్లో అతనికంతా చిరాకుగా ఉండేది. తల్లిదండ్రుల్ని, పల్లెను వదిలి రావడం, మల్లిక మాట వినకుండా, సైన్యంలో వచ్చి చేరడం, స్టేషన్‌లో కన్నీళ్ళతో నిలబడిన మల్లికే తనకింకా గుర్తుంది. అతడు ఖాళీ సమయంలో గుడారం బయట పడుకుని, ఆకాశంలోనికి చూస్తూ ఏవో లెక్కలు కట్టేవాడు. తను బ్రాహ్మడు కాబట్టి మిలటరీలో చేరినా మాంసం జోలికి పోలేదు.

క్రమం తప్పకుండా, ఇంటికి డబ్బు పంపడం, మల్లికకు ఉత్తరాలు రాయడం చేసేవాడు. ప్రతీ ఉత్తరంలోనూ "ఐ లవ్యూ మల్లికా!" అని ప్రారంభించేవాడు.

ఆమె కూడా అన్నింటికీ రిప్లై ఇచ్చేది.

కాలం వేగంగా పరుగెత్తుతోంది. ఇంతలో కార్గిల్ యుద్ధం మొదలయ్యింది. కాశ్మీర్ సరిహద్దులలో, దేశగౌరవాన్ని కాపాడడానికి మిషన్‌గన్ చేత పట్టుకుని పహారా కాయడం, అతనిలో ఉన్న దేశభక్తిని ఇనుమడింపజేసింది.

సైనికుడు తుపాకీ పట్టి, రాత్రింబవళ్లు, సరిహద్దులలో పహారా కాస్తూ, తమ ప్రాణాలను సైతం లక్ష్యపెట్టక, ఎండకు ఎండి, వానకు తడిసి, దేశ సౌభాగ్యం విలసిల్లాలనే అతని ఆరాటం, సాహసం, అకుంఠిత దీక్షల ముందు అన్నీ చిన్నచిన్న విషయాలుగా అగుపిస్తాయి.

అతడు, మల్లికను గురించిన ఆలోచనలు మానలేదు. గడగడ వణికించే చలిలో, అతడు నిద్రపోయే ముందు, తనివితీరా ఆమె ఫోటోను చూసుకునేవాడు.


ఒకరోజు, పోరు భీకరంగా మొదలైంది. బులెట్ల శబ్దంతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. రవిశంకర్ బృందంలో అతనితోపాటు అయిదు మంది సైనికులు వీరకిశోరాల్లాగా విజృంభించసాగారు. శత్రువుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం హోరెత్తుతోంది.

ఇంతలో వాళ్ళమీద బలమైన ఇనుపతీగల వల పడింది. వాళ్ళు అది గమనించి తేరుకునే లోపే ఆ వల విసిరిన హెలీకాప్టర్, వాళ్ళయిదుగురినీ తీసుకెళ్ళి పాకిస్తాన్ సరిహద్దులలోన విడిచిపెట్టింది. ఏదో తియ్యటి వాసన ఆ ప్రాంతాన్ని అలుముకుంది. ఆ అయిదుగురూ స్పృహ తప్పారు. కళ్ళు తెరిచి చూసేసరికి మిలటరీ సెల్‌లో వున్నారు. తాము బందీలుగా చిక్కామని గ్రహించడానికి వాళ్ళకు ఎంతోసేపు పట్టలేదు.

వాళ్లెన్నో చిత్రహింసలకు గురయ్యారు. ఆ జైళ్ళలో భారతీయ సైనికుల్ని పేడలో పురుగులకన్న హీనంగా చూసేవారు. ఎన్నో ప్రశ్నలతో వారిని వేధించుకు తినేవారు. నాలుగు సంవత్సరాలు గడిచాయి.

మల్లిక కోసం అతని హృదయం ఆరాటపడుతోంది. యుద్ధంలో భారతీయ సింహాలదే జయమనే అందిన వార్త అక్కడ బందీలుగా చిక్కిన భారతీయులలో కొత్త ఊపిరి నింపింది.

"26-01-2003" భారత రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా 'బందీల మార్పిడి' (పాకిస్తాన్‌కు చిక్కిన భారతీయ సైనికుల్ని వాళ్ళు వదిలేస్తారు. వాళ్ళు ఎంతమందిని వదిలేశారో సరిగ్గా అందరు 'పాక్ బందీల'ను మనం వదిలేస్తాం రచయిత)కి ఇరుదేశాలూ అంగీకరించాయి. రవిశంకర్ కూడా అందులో ఒకడయ్యాడు. అన్ని ఫార్మాలిటీస్ పూర్తయ్యేసరికి దాదాపు పదిహేను రోజులైంది.



రవిశంకర్ భారతదేశానికి వచ్చాడు.

ఢిల్లీలో వారం రోజులు చికిత్స పొంది, ఇంటికి వచ్చాడు. ఇంటికి తాళం వేసుంది. ఇల్లు పాతబడిపోయినట్లుగా అగుపిస్తోంది. తన గాయాల్ని, ప్లాస్టర్లు వేసిన మొహాన్ని, మణికట్టునూ చూస్తూ ఓ కుర్రాడు అక్కడ నిలబడ్డాడు.

"బాబూ! ఈ ఇంట్లోనివారేమయ్యారు?" అడిగాడు తను.

"ఈ ఇంట్లో శాస్త్రిగారు, ఆయన భార్యా ఉండేవారండీ. వాళ్ళు చనిపోయి సంవత్సరమైంది. వారి అబ్బాయి మిలటరీలో వున్నాడట. పాకిస్తాన్ వాళ్ళు, బందీగా తీసుకెళ్ళారట. బతికున్నాడో, చనిపోయాడో ఎవ్వరికీ తెలీదు," చెప్పాడా కుర్రాడు.

తల్లిదండ్రులు చనిపోయారా!!

అతని గుండెల్లోంచి దుఃఖం తన్నుకొచ్చింది. అక్కడే ఓ గంటసేపు కూలబడ్డాడు.

మల్లిక! మల్లిక!! ఆమె ఎలావుందో?!

లేచి, గబగబా మల్లిక వాళ్లింటికెళ్ళాడు.

వాళ్ళింటిముందున్న కుక్క మొరగడంతో శ్రీనివాస్ బయటకు వచ్చాడు.

"ఎవరూ?"

"శ్రీనివాస్‌గారూ నేనూ శాస్త్రిని."

"శాస్త్రీ నువ్వా!?! రా రా!" అతడు, తనను లోపలికి తీసుకెళ్ళాడు.

"మల్లికా! రవిశంకర్ వచ్చాడమ్మా" కేకేశాడు శ్రీనివాస్.

"శాస్త్రీ! అమ్మా, నాన్నా చనిపోయారు. నీ గురించే వాళ్ళ దిగులంతా. ఎలా వుండేవాడివి ఎలా అయిపోయావ్. ఆ దెబ్బలూ! ఆ రాక్షసులు హింసించారా!"

రవిశంకర్, మౌనంగా ఔనన్నట్లు తలూపాడు.

శ్రీనివాస్ ఏదో చెప్తున్నాడు. అతడు వినడం లేదు. అతని దృష్టంతా లోపల గుమ్మం వైపే వుంది. మల్లిక ఎందుకింత ఆలస్యం చేస్తోందో అర్థం కావడం లేదు.

ఇరవైనాదుగేళ్ళ మల్లిక నెమ్మదిగా ఇవతలికొచ్చింది. చిలకపచ్చ చీరలో మెరిసిపోతోంది. మెళ్ళో మంగళసూత్రం చూసి అదిరిపడ్డాడు.

"ఏం రవీ! బాగున్నావా?" అడిగింది.


అతని కంట్లోంచి నీళ్ళు జలజలా రాలాయి. గుండెను ఎవరో చేతితో బలంగా పిండేసినట్లైంది.

మల్లిక! తన మల్లిక! ఏమైంది?! కలా! నిజమా?!!? ఇంకా తను పాకిస్తాన్‌లోనే వున్నాడా! పీడకల వచ్చిందా! రవిశంకర్‌కు ఏమీ అర్థం కాలేదు. అంతా అయోమయంగా వుంది.

పాకిస్తాన్ సెల్‌లో చిత్రహింసలు అనుభవిస్తూ

## ఫుట్‌బాల్ ఆడనున్న బిగ్‌బి

బిగ్‌బి అమితాబచ్చన్ ఫుట్‌బాల్ ఆడబోతున్నాడట. ఈ నెల 22న జైసల్మేర్‌లో జరిగే ఎడారి ఉత్సవాల్లో అమితాబ్ ఫుట్‌బాల్ మైదానంలో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటాడు. ఎడారి ఉత్సవాల్లో భాగంగా అమితాబ్ ఆట్లాడుతున్నా, ఆయన నటిస్తున్న 'అబ్ తుమ్హారే హవాలే వతన్ సాథియో' సినిమాలో భాగంగా ఫుట్‌బాల్ ఆటనీ షూట్ చేస్తారు. బాబిడియోల్, అక్షయ్‌కుమార్ కూడా ఫుట్‌బాల్ ఆడతారు. ఆటకి ఇప్పటి నుంచే అమితాబ్ కసరత్తులు చేస్తున్నాడు.



అనుకునేవాడు.

"ఎప్పటికైనా ఇండియాకు వెళతాను. మల్లికతో హాయిగా జీవితాన్ని కొనసాగిస్తాను," అని. ఆ ఆశతోనే అతడు, వాళ్ళు పెట్టే చిత్రహింసలన్నింటినీ ఆనందంగా అనుభవించేవాడు. ఆమె కోసమే జీవిస్తున్నట్లు తపన పడేవాడు. కానీ ఈ రోజు ఏమైంది!?!

అప్పుడే పూజ ముగించుకుని, ఓ వ్యక్తి హాల్లోనికి వచ్చాడు.

"రవీ! మావారు." పరిచయం చేసింది.

"హాయ్! మిస్టర్ రవిశంకరశాస్త్రీ ది గ్రేట్! మై నేమ్ ఈజ్ చంద్రశేఖర్," చెప్పాడతడు.

మల్లిక తన ప్రేమ గురించి ఇంట్లో చెప్పలేదా?!

ఒకవేళ చెప్పినా ఇంట్లో ఒప్పుకోలేదా?!

ఏం జరిగిందసలు?

మల్లిక చాలా ఆనందంగా అగుపిస్తోంది!!

అసలు మల్లిక తనను ప్రేమించిందా!?!

అతని ఊహలు, అతడ్ని కలవరపెడుతున్నాయి.

ఇకతను వెళ్తానని లేచాడు. అందరూ అతడ్ని బలవంతంగా కూర్చోబెట్టారు. అతనికి స్వీట్ తినిపించారు.

"ఈ రోజు స్పెషలేంటి?" అడిగాడు రవిశంకర్.

"ఈ రోజు ఫిబ్రవరి 14. వాలెంటైన్స్ డే!" అన్నాడు చంద్రశేఖర్.

"అంతకన్నా స్పెషల్! ఈ రోజు నీ పుట్టిన రోజు" చెప్పింది మల్లిక.

ఒక్కసారిగా తను స్థాణువయ్యాడు.

\+ \+ \+

రవిశంకర్, తన జీవితంలో 'పెళ్ళి' అనే పదాన్ని తొలగించాడు. ఎన్నో గ్రంథాలు అధ్యయనం చేశాడు. ఆగిపోయిన చదువును కొనసాగించాడు. గొప్ప రచయితగా, గణితశాస్త్రవేత్తగా, తత్వవేత్తగా రూపుదిద్దుకున్నాడు.

కాలింగ్ బెల్ మోగడంతో అతడు వర్తమానంలోనికి వచ్చాడు. వెళ్ళి తలుపు తెరిచాడు. ఎదురుగా యూనివర్సిటీ విద్యార్థినీ విద్యార్థులు.

"హాపీ బర్త్‌డే సర్."

"థాంక్యూ! డియర్ బాయ్స్ అండ్ గాల్స్! థ్యాంక్యూ సో మచ్."

"సర్! ఈ రోజు మీ జన్మదినాన్ని పురస్కరించుకుని, మాకో సందేశం ఇవ్వాలి. 2044 లో మీరిస్తున్న ఈ సందేశం భూమి రూపురేఖలు పోయేంతవరకూ నిలిచిపోయేంతగా స్థిరత్వాన్ని కలిగి వుండాలి, ప్లీజ్!" అన్నాడో విద్యార్థి.

"అవున్సార్! అలాంటి సందేశం కావాలి! ప్లీజ్!" అందొక విద్యార్థిని.

రవిశంకర్ ఒక్క క్షణం కళ్ళు మూసుకుని తెరిచాడు.

"ఫ్రెండ్స్! జీవితంలో ఎదురయ్యే ప్రతీ సిద్ధాంతానికీ కొన్ని మినహాయింపులుంటాయి. ఈ విశ్వంలో ఏ వాక్యమూ అన్ని సందర్భాలలోనూ సత్యం కాలేదు. మీరు, దీన్ని విశ్లేషించుకుంటే గొప్ప అర్థం బోధపడుతుంది. ఓ.కే!" చెప్పి లోపలికి నడిచాడు.

మల్లిక తనను ప్రేమించిందో లేదో!

అసలేం జరిగిందో ఇప్పటికీ తెలీదు, రవిశంకర్‌కు.

అసలు మల్లిక ప్రేమించిందా!?!

(మన రాష్ట్రపతి గౌరవనీయులు డాక్టర్ అబ్దుల్ కలామ్ గారికి ఈ కథ అంకితం. నేటి యువతీయువకులు ఆయన నుండి నేర్చుకోవాల్సింది చాలా వుంది - రచయిత) ❀